## క్లుప్తంగా

### కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నా..

- మాజీ బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి రఘునాథ్ యాదవ్



హఫీజ్‌పేట్ : రేపు ఖమ్మంలో జరిగే కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభలో రాహుల్ గాంధీ సమక్షంలో పార్టీలో చేరతానని మాజీ బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి మారబోయిన రఘునాథ్ యాదవ్ తెలిపారు. శుక్రవారం మదీనాగూడలోని కిన్నెర గ్రాండ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు, బీఆర్ఎస్ పార్టీని గద్దె దింపేందుకే కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నానన్నారు. తాను స్వర్గీయ పీ.జనార్దన్‌రెడ్డి అభిమానినని శేరిలింగంపల్లికి ఆయన చేసిన అభివృద్ధి మరువలేమన్నారు. కాంగ్రెస్ పార్టీ యువతకు పెద్ద పీట వేస్తున్నారన్నారు.


### కార్పొరేటర్ సమీక్ష



సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ ,జలమండలి అధికారులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ శుక్రవారం రోడ్లు, జలమండలి అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో పెండింగ్ పనులు, జరుగుతున్న పనులు, నూతనంగా నిర్మించనున్న డ్రైనేజీ లైన్లు, రోడ్లపై చర్చించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, డీజీఎం వెంకటేశ్వర్లు, ఏఈ శ్రావణి, మేనేజర్ ఝాన్సీ, వర్కు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ డివిజన్ ఉపాధ్యక్షుడు కాశీనాద్ యాదవ్ శివరాజ్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, షౌకత్ ఆలీ మున్నా, పోశెట్టి గౌడ్ పాల్గొన్నారు.

### శాకంబరిగా భ్రమరాంబిక



ఆల్విన్‌కాలనీ: ఆషాఢమాసం రెండవ శుక్రవారం సందర్భంగా కూకట్‌పల్లి ఆల్విన్‌కాలనీ ఫేజ్ 2లోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో అమ్మవారు శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త శ్యామల భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు అఖిలేశ్వర శర్మ పూజ నిర్వహించారు. సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారికి అలంకరించిన కూరగాయలతో శనివారం మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని , భక్తులు పాల్గొనాలని వారు కోరారు.


### కృష్ణ పెరల్స్‌కు 'లెజెండ్స్ ఆఫ్ సౌత్ జువెలరీ' అవార్డు

సాక్షి, సిటీబ్యూరో: ఇంగ్లాండ్ ఆధారిత ఇన్‌ఫార్మా పీఎల్‌సి సంస్థ ఆధ్వర్యంలో 16వ ఎడిషన్ జువెలరీ అండ్ జెమ్ ఫెయిర్‌ను నగరంలోని నోవాటెల్ హెచ్ఐసిసి వేదికగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో భాగంగా అద్భుతమైన కస్టమర్ సేవలు, నాణ్యమైన జువెలరీ అందిస్తున్న పంజగుట్టలోని కృష్ణ పెరల్స్ అండ్ జువెలర్స్‌ను 2023 'లెజెండ్స్ ఆఫ్ సౌత్ జువెలరీ' అవార్డు విజేతగా ప్రకటించింది. ఈ సందర్భంగా కృష్ణ పెరల్స్ మేనేజింగ్ పార్టనర్ దేవేందర్ అగర్వాల్ మాట్లాడుతూ.. ఈ అవార్డు గెలుచుకోవడం గర్వంగా ఉందని, గత 40 ఏళ్లుగా కస్టమర్లకు అందిస్తున్న నాణ్యమైన సేవలకు గుర్తింపు రావడం నూతన ఉత్సాహాన్ని అందిస్తుందని అన్నారు.

### 12 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. బుధ, గురువారాల్లో డ్రంకెన్ డ్రైవ్‌లో 12 మందిని పట్టుకున్నారు. శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా జడ్జి ఒక్కొక్కరికీ రూ.2 వేల చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపారు.

### అందరికీ నెగెటివ్



పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం 13 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు చేయగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. ఆర్టీపీసీఆర్ టెస్టులు 11 మందికి చేశామన్నారు.

# రోడ్డుకు గేట్

- అమీన్‌పూర్ భరత్‌నగర్‌లో 33 ఫీట్ల రోడ్డు మూసివేత
- బల్దియా కీలక ప్రజాప్రతినిధి వ్యవహారం

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి : అమీన్‌పూర్‌లో భూకబ్జాదారులు బరితెగిస్తున్నారు. ఏకంగా ఓఅడుగు ముందుకేసి ప్రజలు రాకపోకలు సాగించే రోడ్డునే కబ్జా చేశారు. ప్రహరీ నిర్మించి గేటు పెట్టేశారు. ఈ కబ్జాకు పాల్పడింది అధికార బీఆర్ఎస్ పార్టీకి చెందిన కీలక ప్రజాప్రతినిధి కావడంతో జిల్లా అధికార యంత్రాంగం అటువైపు కన్నెత్తి చూడటం లేదు. అమీన్‌పూర్‌లోని భరత్‌నగర్ కాలనీలో ఓ వెంచర్ ఏర్పాటు చేశారు. ఈ వెంచర్‌లో 33 ఫీట్ల రోడ్డును అమీన్‌పూర్ మున్సిపాలిటీకి చెందిన ఓ కీలక ప్రజాప్రతినిధి కబ్జా చేశాడు. రోడ్డుకు ఒకవైపు ప్రహరీ నిర్మించి మూసి వేశారు. మరోవైపు కూడా ప్రహరీ నిర్మించి గేటు పెట్టేశాడు. దీంతో తాము రాకపోకలకు ఇబ్బందిపడుతున్నామని భరత్‌నగర్ కాలనీవాసులు వాపోతున్నారు. ఈ రోడ్డు మూసివేయడంతో స్థానికులు, వాహనదారులు చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. రోడ్డుకు ఇరువైపులా తన ఇల్లు, మరోవైపు వాణిజ్యపరమైన స్థిరాస్తి ఉంది. తనను అడిగేవారే లేరన్న చందంగా ఈ రోడ్డును మూసివేశారనే విమర్శలు సర్వత్రా వెల్లువెత్తుతున్నాయి.

**ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు..**

రోడ్డు కబ్జా చేసిన వ్యవహారంపై స్థానికులు పలుమార్లు అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కానీ మున్సిపల్ ప్రజాప్రతినిధే ఈ కబ్జా చేయడంతో మున్సిపల్ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఈ అక్రమాలపై రెండు నెలల క్రితం కలెక్టరేట్‌లోనూ ఫిర్యాదు చేశారు. మరోవైపు మున్సిపల్ పరిపాలనశాఖ డైరెక్టర్, హెచ్ఎండీఏ కమిషనర్, హెచ్ఎండీఏ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి కూడా ఫిర్యాదులు వెళ్లాయి. ఈ ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్ అధికారులు కనీసం పట్టించుకోలేదని తెలిపారు.

**హైకోర్టుకు సామాజిక కార్యకర్త..**

పటాన్‌చెరుకు చెందిన సామాజిక కార్యకర్త వి.రవికృష్ణ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. పిటీషన్‌ను స్వీకరించిన హైకోర్టు ఈ కబ్జాపై విచారణ చేపట్టాలని, నాలుగువారాల్లో చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగానికి హైకోర్టు ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. బీఆర్ఎస్ నేత కావడంతో అధికారులు చర్యలు తీసుకుంటారా.. లేదా వదిలేస్తారా వేచి చూడాల్సిందే. అధికారులు పట్టించుకోకపోవడం వల్లే తాను న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వచ్చిందని రవికృష్ణ చెప్పారు.



గేటు నిర్మించింది భరత్‌నగర్ కాలనీలో రోడ్డుపైనే...

**షోకాజ్ నోటీసులు జారీ చేశాం : సుజాత, మున్సిపల్ కమిషనర్**

హైకోర్టు ఆదేశాల మేరకు భరత్‌నగర్‌లో రోడ్డు కబ్జా చేసిన వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. రోడ్డు కబ్జా అయ్యిందా లేదా? అనేది తెలియదు. అక్కడికి వెళ్లి చూశాక చెబుతాం. హైకోర్టు ఆశ్రయించిన వారికి కూడా నోటీసులు జారీ చేశాం.

## ప్రభుత్వం చిత్తశుద్ధితో అభివృద్ధి చేస్తోంది



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు

- ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ
- హఫీజ్‌పేట్, మాదాపూర్ డివిజన్లలో రూ.7.50 కోట్ల అభివృద్ధి పనులు

హఫీజ్‌పేట్ : రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. శుక్రవారం హఫీజ్‌పేట్, మాదాపూర్ డివిజన్ల పరిధిలో సుమారు రూ.7.50 కోట్లతో పలు అభివృద్ధి పనులకు కార్పొరేటర్లు పూజిత, జగదీశ్వర్‌గౌడ్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హఫీజ్‌పేట్ డివిజన్‌లో రూ.4.42 కోట్లు....హుడా కాలనీ, దత్తసాయి ఎన్‌క్లేవ్, ఆర్టీసీ కాలనీ, రామకృష్ణనగర్, మైత్రినగర్ కాలనీలలో రూ.1.69 కోట్లతో సీసీ రోడ్లు, వైశాలినగర్, ఉషోదయ ఎన్‌క్లేవ్, ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీలో రూ.70.70 లక్షలతో సీసీ రోడ్లు, ఓల్డ్ హఫీజ్‌పేట్, ప్రజయ్‌సిటి, జనప్రియనగర్‌లలో రూ.95 లక్షలతో సీసీ రోడ్లు, ఓల్డ్ హఫీజ్‌పేట్, యూత్ కాలనీ, సాయినగర్ కాలనీలలో రూ.1.7 కోట్లతో సీసీ రోడ్డు పునరుద్ధరణ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నామన్నారు. మాదాపూర్ డివిజన్‌లో రూ.3.15 కోట్లతో.. ఆదిత్యనగర్, సుభాష్‌చంద్రబోస్‌నగర్, భిక్షపతి నగర్‌లలో రూ.1.1 కోట్లతో సీసీ రోడ్లు, కాకతీయ హిల్స్, సుభాష్‌చంద్రబోస్‌నగర్ కాలనీలలో రూ.49 లక్షలతో సీసీ రోడ్లు, సిద్ధివినాయకనగర్, ధోబీఘాట్ కాలనీలో రూ.95 లక్షలతో సీసీ రోడ్లు, గుట్టల బేగంపేట్, అయ్యప్పసొసైటీ కాలనీలలో రూ.69 లక్షలతో సీసీ రోడ్డు పునరుద్ధరణ పనులు చేపట్టనున్నామన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడకూడదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గౌతమ్‌గౌడ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, లక్ష్మారెడ్డి, నల్ల సంజీవరెడ్డి, యాదగిరిగౌడ్, రఘునాథ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షపు నీరు నిల్వకుండా చర్యలు



బయోడైవర్సిటీ కూడలి, ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా వద్ద రోడ్లను పరిశీలిస్తున్న అధికారుల బృందం

రాయదుర్గం: వర్షాకాలం రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాలను శేరిలింగంపల్లి సర్కిల్ ఇంజనీరింగ్ మాన్‌సూన్ టీమ్ పరిశీలించింది. గురువారం రాత్రి వర్షం పడుతుండగా గచ్చిబౌలి పరిసరాల్లోని ప్రధాన రోడ్లను అధికారుల బృందం సర్కిల్ ఈఈ శ్రీనివాస్, డీఈ విశాలాక్షి, ఏఈ జగదీష్, వర్క్ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌లతో కూడిన బృందం పరిశీలించారు. గచ్చిబౌలిలోని బయోడైవర్సిటీ పార్కు కూడలి, రాష్ట్ర ఎన్నికల కమిషన్ భవనం ఎదుటిరోడ్డు, ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా రోడ్డు ప్రాంతాలను వారు పరిశీలించారు. సమస్య ఉన్నచోట తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

పటాన్‌చెరు టౌన్: హైదరాబాద్ గీతం బిజినెస్ స్కూల్‌లో ఎంబీఏ, బీబీఏ, జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) అకాడమీ సౌజన్యంతో నిర్వహిస్తున్న బీబీఏ (ఫైనాన్షియల్ మార్కెట్స్)తో పాటు బ్రిటన్‌కు చెందిన ఏసీసీఏ సౌజన్యంతో నిర్వహిస్తున్న బీకాం (ఆనర్స్)ల్లో చేరడానికి దరఖాస్తులు కోరుతున్నట్లు అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ ఉదయ కుమార్ శుక్రవారం తెలిపారు. గీతం ప్రవేశ పరీక్ష (గ్యాట్–2023), బృంద చర్చలు (జీడీ), వ్యక్తిగత ఇంటర్వ్యూ (పీఐ)ల ఆధారంగా ప్రవేశాలు కలిస్తామని పేర్కొన్నారు. క్యాట్/ మ్యాట్/ జీమాట్/ ఎక్సాట్/ ఆత్మా/ఎన్‌మాట్ స్కోర్లు ఉన్నవారికి గీతం ప్రవేశ పరీక్ష నుంచి మినహాయింపు ఉంటుందన్నారు. బృంద చర్చలు, వ్యక్తిగత ఇంటర్వ్యూలు తప్పనిసరని స్పష్టం చేశారు. దరఖాస్తులు, సమాచార పత్రాలు www.gitam.edu వెబ్‌సైట్ నుంచి పొందొచ్చన్నారు. మరిన్ని వివరాలకు 9542424254 / 59 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

## వాణిజ్య బ్యాంకులతో సమానంగా సేవలు

ఏపీజీవీబీ ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి



పటాన్‌చెరు శాఖను ప్రారంభిస్తున్న ఏపీజీవీబీ ఛైర్మన్ ప్రతాప్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: కమర్షియల్ బ్యాంకులతో సమానంగా ఏపీజీవీబీ సేవలు అందిస్తోందని ఏపీజీవీబీ ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆధునికీకరించిన ఏపీజీవీబీ పటాన్‌చెరు శాఖను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీజీవీబీ (ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంక్)లో అన్ని రకాల సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. గతంలో రైతులు, డ్వాక్రా మహిళలకు సేవలు అందించేవారమని, ప్రస్తుతం గృహ రుణాలు నుంచి కమర్షియల్ బ్యాంక్ నిర్వహించే అన్ని రకాల సేవలు ఇందులో అందిస్తున్నామన్నారు. ఖాతాదారులకు చేరువయ్యేందుకు బ్రాంచ్‌ను ఆధునికీకరించామని, డిజిటల్ సేవలు కూడా అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. తక్కువ వడ్డీకే గృహ రుణాలు ఇస్తున్నామన్నారు. ఈ అవకాశం సెప్టెంబర్ 30 వరకు నిర్వహించే క్యాంపులో కల్పించామన్నారు. ఖాతాదారులు తమ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎఫ్ఐసీ అండ్ ఆడిట్ జీఎం సుబ్రహ్మణ్యం, ఏజీఎం అండ్ రీజినల్ మేనేజర్ ఎస్ఎల్ఎన్ ప్రసాద్, పటాన్‌చెరు బ్రాంచ్ మేనేజర్ ఈవీఎస్ఎస్ మూర్తి, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు బీఎల్ఎఫ్ నియోజకవర్గ స్థాయి సమావేశం

మియాపూర్: బహుజన్ లెఫ్ట్ ఫ్రంట్ శేరిలింగంపల్లి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం మియాపూర్‌లోని ముజాఫర్ అహ్మద్‌నగర్‌లో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుందని శేరిలింగంపల్లి నియోజకవర్గ కన్వీనర్ కమిటీ సభ్యులు ఇస్లావత్ దశరథ్ నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బీఎల్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ నల్లా సూర్యప్రకాష్, రాష్ట్ర కన్వీనర్ వనం సుధాకర్‌లు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశానికి నాయకులు, కార్యకర్తలు, కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ఐటీ కారిడార్‌లో చైన్ స్నాచింగ్

గంట వ్యవధిలో.. ఇద్దరు నిందితులు అరెస్ట్

గచ్చిబౌలి: ఐటీ కారిడార్‌లో చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరు యువకులను గంట వ్యవధిలోనే గచ్చిబౌలి పోలీసులు అరెస్ట్ చేశారని మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి తెలిపారు. గచ్చిబౌలిలోని టీసీఎస్ కంపెనీలో గాయత్రి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తోంది. శుక్రవారం 4.30 గంటలకు విధులు ముగించుకొని నడుచుకుంటూ ఏపీహెచ్‌బీ కాలనీలోని పీజీ హాస్టల్‌కు వెళుతోంది. టయోటా షోరూమ్‌లో కార్ వాషింగ్ పనులు చేస్తూ ఇజ్జత్‌నగర్‌లో నివాసం ఉండే సబావత్ విజయ్(19) వెనక నుంచి వచ్చి గాయత్రి మెడలో గొలుసు లాక్కొని పరిగెత్తాడు. సమీపంలో హోండా యాక్టివాతో సిద్ధంగా ఉన్న గుర్రం జాన్ అలియాస్ జీసస్(20)లు కలిసి బైక్‌పై పారిపోయారు. గచ్చిబౌలి క్రైం పోలీసులు, సీసీఎస్ మాదాపూర్ పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా కొండాపూర్‌లోని ఓయో వైట్‌రిడ్జ్ హోటల్‌లో ఉన్నట్లు గుర్తించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి 10 గ్రాముల బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## అభివృద్ధిపై కరపత్రాలతో ప్రచారం



కృష్ణనగర్ కాలనీలో పర్యటిస్తున్న బీజేపీ నాయకుడు రవికుమార్ యాదవ్ తదితరులు

హఫీజ్‌పేట్ : మాదాపూర్ డివిజన్ పరిధిలోని సైబర్ వ్యాలీ, సైబర్ విలేజ్, కృష్ణనగర్‌లలో ప్రధాని నరేంద్ర మోడీ చేసిన అభివృద్ధిని, కేంద్ర ప్రభుత్వ పథకాలను తెలియజేస్తూ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ శుక్రవారం ఇంటింటికి కరపత్రాలను పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడీ పేదల ప్రజల కోసం పీఎం స్వనిధి, బేటీ బచావో–బేటీ పడావో ఇలా వివిధ రకాల సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారన్నారు. కాగా సీఎం కేసీఆర్ తొమ్మిది సంవత్సరాలు ప్రజలను మాయామాటలతో మోసం చేస్తూనే ఉన్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాధాకృష్ణ యాదవ్, చంద్రశేఖర్ యాదవ్, సూర్యనారాయణ, హరీష్, రాహుల్, తరుణ్, మంగేష్, వంశీ, శ్రీను, గోవర్ధన్‌రెడ్డి, యాదయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

**మియాపూర్‌లో..**

మియాపూర్: మియాపూర్‌లోని బీకే ఎన్‌క్లేవ్ ప్రజయ్ షెల్టర్ కాలనీలో గడప గడపకు బీజేపీ పాదయాత్రను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్‌యాదవ్ బీజేపీ నాయకులతో కలిసి కాలనీలో ఇంటింటికి తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. అంతకు ముందు మహిళలు హారతులతో స్వాగతం పలికారు.

## పెళ్లై నెల.. పారిపోయిన యువతి



జగ్దేవి

గచ్చిబౌలి: పెళ్లైయిన నెల రోజులకు తల్లిగారింటికి వచ్చిన యువతి కుటుంబ సభ్యుల కళ్లుగప్పి పరారైన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కర్నాటక బీదర్‌కు చెందిన పార్వతి ఇద్దరు కూతుళ్లు, కొడుకుతో కలిసి గోపన్‌పల్లి తండాలో నివాసం ఉంటోంది. పెద్ద కూతురు జగ్దేవికి ఔరత్‌కు చెందిన పవార్‌తో మే నెల 29న వివాహం జరిగింది. కొద్ది రోజుల క్రితం జగ్దేవి తల్లి గారింటికి వచ్చింది. జూన్ 29న సాయంత్రం 4 గంటల సమయంలో తల్లి, కూతుళ్లు బయటకు వచ్చారు. వారి కళ్లు గప్పి జగ్దేవి పారిపోయింది. సమీప ప్రాంతాలలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## గోల్ఫ్‌లో రాణించిన గౌలిదొడ్డి గురుకుల విద్యార్థులు



విద్యార్థులతో క్రీడాధికారి రామ్ లక్ష్మణ్, ఆర్‌సీఓ డాక్టర్ శారదావెంకటేష్

రాయదుర్గం: క్రీడల్లోనూ రాణిస్తామని గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులు నిరూపించారు. గోల్ఫ్‌లో పలు పతకాలను సాధించారు. వీరిని శుక్రవారం సాయంత్రం కళాశాలలో గురుకుల సొసైటీ క్రీడాధికారి రామ్ లక్ష్మణ్, ఆర్‌సీఓ డాక్టర్ శారదావెంకటేష్, ఐఐటీ నీట్ అకాడమీ ప్రిన్సిపల్ బి పాపారావు, వ్యాయామ ఉపాధ్యాయులు కే సత్యనారాయణలు సత్కరించి అభినందించారు. మైసూర్‌లో జరిగిన సౌత్ జోన్ జూనియర్ గోల్ఫ్ క్రీడాపోటీలో గూగులోత్ అమూల్య (కేటగిరి–ఏ) మొదటిస్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించారు. అదేవిధంగా ఉసికల అఖిత(కేటగిరి ఏ) ద్వితీయ స్థానం..సిల్వర్ మెడల్, మాల అనూష (కేటగిరిబి) మూడవస్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా ఆర్‌సీఓ, ప్రిన్సిపల్ మాట్లాడుతూ భవిష్యత్తులోనూ విద్యార్థులు క్రీడల్లో రాణించేలా ప్రోత్సహిస్తామని వారు పేర్కొన్నారు.

## ఆటలతో ఆరోగ్యం



క్రికెట్ పోటీలో పాల్గొన్న వైద్య బృందం

రాయదుర్గం: ఆటలతో ఆరోగ్యం అదే మెడికవర్ ఆస్పత్రి కర్తవ్యమని ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ మిథిల్ ఘుసే స్పష్టం చేశారు. శుక్రవారం మెడికవర్ ఆస్పత్రులలోని వివిధ విభాగాల డాక్టర్లు, ఎన్‌సీసీ గార్డెనియా మెంబర్స్ మధ్య క్రికెట్ మ్యాచ్‌ను నిర్వహించారు. ఈ మ్యాచ్‌లో మెడికవర్ ఆస్పత్రి కెప్టెన్ వీఎల్ కేశవరెడ్డి, ఎన్‌సీసీ కెప్టెన్‌గా మోజెస్ వ్యవహరించారు.ఈ పోటీల ప్రారంభంలో ఆయన మాట్లాడుతూ ఆటలవల్ల మెదడు ఉత్తేజాన్ని పొందుతుందన్నారు. చేతికి, కంటికి సమన్వయం పెరుగుతుందని, వేగంగా, మరింత ఖచ్చితమైన నిర్ణయం తీసుకోవడం ఆటలతోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో మెడికవర్ ఆస్పత్రుల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హరికృష్ణ, పర్చేజ్ హెడ్ కేశవరెడ్డి, డాక్టర్ సతీష్ కుమార్ కైలాసం, సీఎఫ్ఓ వినీత్, వైద్యులు, ఎన్‌సీసీ గార్డెనియా సభ్యులు పాల్గొన్నారు.

## జాతీయ వైద్యుల దినోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థులు

మియాపూర్: మియాపూర్ మదీనాగూడలోని కెనరీ ద స్కూల్‌లో శుక్రవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నాటిక, నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి. అనంతరం డాక్టర్లనుస్కూల్ యాజమాన్యం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు లిడియా క్రిస్టినా, అడ్మిన్ మేనేజర్ పాఠశాల కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కార్మికులకు గొడుగుల పంపిణీ

సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుత సీజన్‌ను పురస్కరించుకుని చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు, చిరుద్యోగులకు భారీ స్థాయిలో గొడుగుల పంపిణీ ప్రారంభమైంది. దీని కోసం నగరానికి చెందిన ఆర్థిక సాంకేతిక సేవల సంస్థ రికొర్డెంట్...నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎన్ఐ–ఎమ్ఎస్ఎమ్ఇ)తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. దీనిలో భాగంగా నగరంలోని పారిశ్రామిక వాడల్లో పనిచేస్తున్న సెక్యూరిటీ తదితర కింది స్థాయి సిబ్బందికి ఉచితంగా నాణ్యమైన గొడుగులను పంపిణీ చేస్తున్నట్టు వెల్లడించారు.

## అమీన్‌పూర్‌లోనే పాలిటెక్నిక్ కళాశాల

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: సీఎం కేసీఆర్ ఇటీవల ప్రకటించిన పాలిటెక్నిక్ కళాశాల అమీన్‌పూర్‌లోనే ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి వెల్లడించారు. సీఎం కేసీఆర్ కృషితోనే వెనుకబడిన వర్గాలకు ఆత్మ గౌరవ భవనాలు సాధ్యం కావడంతోపాటు, కనుమరుగవుతున్న కులాలకు జీవం కల్పించారన్నారు. నియోజకవర్గంలో వడ్డెర కులస్తుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ మంజీరానగర్‌లో ఏర్పాటు చేసిన వడ్డెర యూత్ అసోసియేషన్ నూతన కార్యాలయ భవనాన్ని స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వడ్డెర కులస్తుల విజ్ఞప్తి మేరకు త్వరలోనే మినీ ఫంక్షన్ హాల్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నరసింహగౌడ్, కౌన్సిలర్‌లు మల్లేష్, సీనియర్ నాయకులు ప్రమోద్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, యూనుస్, చంద్రశేఖర్, దాసు, రాములు, జగదీష్, కాలప్ప, వడ్డెర సంఘం ప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.

## సీఆర్ ఫౌండేషన్ రామలింగయ్య పుట్టినిల్లులా ఉంది

వాకింగ్ ట్రాక్, కళాక్షేత్రం ప్రారంభోత్సవంలో అల్లు అరవింద్



ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను ప్రారంభిస్తున్న సినీ నిర్మాత అల్లు అరవింద్, చిత్రంలో మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి, నారాయణ తదితరులు

హఫీజ్‌పేట్ : కొండాపూర్‌లోని చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ మా నాన్న అల్లు రామలింగయ్య పుట్టినిల్లులా ఉందని ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్ పేర్కొన్నారు. శుక్రవారం సీఆర్ ఫౌండేషన్‌లోని వృద్ధాశ్రమంలో నివాసముండే మల్లంపాటి మురళి, మల్లంపాటి వెంకటేశ్వరరావులు తమ సొంత డబ్బుతో దాసరి నాగభూషణం పార్కులో వాకింగ్ ట్రాక్, సీఆర్ కళాక్షేత్రంలోని ఓపెన్ ఎయిర్ థియేటర్ నిర్మించారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా అల్లు అరవింద్, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి, సీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ కే.నారాయణ, మాదాల రవి, ప్రముఖ సినీ సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్‌లు హాజరయ్యారు. సురవరం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ వృద్ధులు ఉదయం, సాయంత్రం సరదాగా నడవాలన్నా, కాసేపు కూర్చొని నాటకాలు చూడాలన్నా ఈ వేదికలు చాలా ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు, కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే, సీఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రావు, ప్రతాప్‌రెడ్డి, సంధ్య కుమారి, డాక్టర్ కె.రజిని, కృష్ణకుమారి, మల్లంపాటి వెంకటేశ్వరరావు, శివశంకర్, చెన్నకేశవులు, సీఆర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## జల్సాలకు అలవాటు పడి చోరీలు

8 బైక్‌లు, ఆటో, ల్యాప్‌టాప్ స్వాధీనం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): జల్సాలకు అలవాటు పడి బైక్‌లను దొంగిలిస్తున్న ఓ యువకుడిని రామచంద్రాపురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ నరేందర్ రెడ్డి కథనం ప్రకారం.. రామచంద్రాపురం పట్టణంలో గురువారం రాత్రి పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీకి చెందిన చిన్న ప్రకాశ్ అలియాస్ చింటూ బైక్‌పై వస్తుండగా అనుమానంతో అతని వాహనాన్ని ఆపి సంబంధిత పత్రాలను చూపించాలని కోరారు. దాంతో చిన్న ప్రకాష్ సరైన పత్రాలు చూపించకపోవడంతో పాటు పొంతనలేని సమాధానం చెప్పడంతో పోలీసులకు అనుమానం వచ్చి అదుపులోకి తీసుకొని విచారించారు. జల్సాల కోసం మోటార్‌సైకిల్ చోరీ చేస్తున్నట్లు విచారణలో ఒప్పుకున్నాడని పోలీసులు పేర్కొన్నారు. ఈ సంఘటనలో నిందితుడు దొంగిలించిన 8 బైక్‌లు, ఆటో, ల్యాప్‌టాప్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కాగా చిన్న ప్రకాష్‌పై సైబరాబాద్‌లో 8కేసులు, సదాశివపేట్‌లో 2కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అతణ్ని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కేసును త్వరగా ఛేదించినందుకు ఏసీపీ నరసింహారావు ఇన్‌స్పెక్టర్ నరేందర్ రెడ్డి, ఎస్ఐ శశికాంత్ రెడ్డి, క్రైం సిబ్బందిని అభినందించారు.